జై భారత్ పార్టీ మహిళా అభ్యర్థిపై దాడి అమానుషం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జై భారత్ నేషనల్ పార్టీ తిరుపతి అభ్యర్థి ముని లక్ష్మిపై దుండగులు దాడి చేయడం అమానుషం అని ప్రజాస్వామ్యంలో ఇటువంటి పద్ధతులు మంచిది కాదని జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తరంధ్ర కన్వీనర్ జైదేవ్ ఇంజరాపు, పార్టీ అధికార ప్రతినిధి మరియు లీగల్ సెల్ కన్వీనర్ చౌదరి లక్ష్మణరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఇప్పిలి సీతరాజు, శ్రీకాకుళం అసెంబ్లీ కోఆర్డినేటర్, రాగోలు శివ, పాతపట్నం నియోజకవర్గ కోఆర్డినేటర్ బాలకృష్ణ పట్నాయక్, టెక్కలి నియోజకవర్గం కోఆర్డినేటర్ ఉదయ కుమార్ లు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

తాగునీటి సమస్య నివారణే లక్ష్యం

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్య నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 19వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ బోరును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటికే 5 నీటి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శిష్టు బృందావతి, వైసీపీ నాయకులు శిష్టు గోపి, బడగల బల్లయ్య, దున్న సత్యం, బగాది సింహాచలం, సీపాన శ్రీరాములు, దుమ్ము రాజు, లోకేష్, సనపల క్రిష్ణ, కె.క్రిష్ణ, కె.సుధాకర్, పి.భాస్కరరావులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-రణస్థలం : నేడు (06-03-2024) కోస్ట సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనుల నిమిత్తం కోస్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు కోస్టా, వల్లభరావుపేట, వెంకటరావు పేట, పల్లిపేట, పైడిపేట, పతివాడపాలెం, పిషిని, నెలివాడ, చిల్లపేట రాజాం గ్రామాలకు ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 05 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జైహో బీసీ సభలో పాల్గొన్న పాతపట్నం టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-కొత్తూరు : మంగళగిరిలో జరిగిన జైహో బీసీ సభలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌ఛార్జి కలమట వెంకట రమణమూర్తి పలువురు పార్టీ అనుచరులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లతో కలిశారు.

గ్రావిటీ మెయిన్ నిర్మాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మాన

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా సైరిగాం గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంకుకు గ్రావిటీ మెయిన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి జడ్పీ నిధులు 5 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు ధర్మాన కృష్ణ చైతన్యతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

విశాలాంధ్ర -సంతబొమ్మాళి... సంతబొమ్మాలి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో సూపర్ సిక్స్ గ్యారెంటీ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలు వివరాలను కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న రాష్ట్ర చేనేత కార్మిక సంఘం డైరెక్టర్ కూచెట్టి కాంతారావు, చల్లా జగ్గారావు, మాజీ ఎంపీటీసీ వజ్జ ప్రభాకర్‌రావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సవ్వన ప్రసాదరావు, కూచెట్టు భాను ప్రకాష్, బేండి అరుణ్ కుమార్, సర్పంచ్ పంగ అసిరినాయుడు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మహిళా సాధికారత ద్వారా ప్రతీ కుటుంబం, దేశ అభివృద్ధి జరుగుతుందని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ అన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఎంపవర్ హర్ నినాదంతో మంగళవారం డే అండ్ నైట్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించాం అని, 6వ తేదీన ఉచిత వైద్య శిబిరం, 7వ తేదీన మహిళా సమావేశం నిర్వహించి జిల్లాలో వివిధ రంగాల్లో మహిళా ప్రముఖులకు సన్మానం నిరచిస్తామన్నారు. నవ సమాజ నిర్మాణంలో బెటీ బచావో... బెటీ పడావ్.. అనే నినాదంతో యూనియన్ బ్యాంక్ భాగస్వామ్యం అవుతుందన్నారు. మహిళల కు గౌరవ భావంతో చూసి అన్ని రంగాల్లో వారు మరింత అభివృద్ధి చెందేలా ప్రతీఒక్కరూ మహిళలకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్‌లు, చీఫ్ మేనేజర్‌లు, ఇందిరా ప్రియదర్శిని, స్వర్ణశ్రీ, యూనియన్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంవో అధికారులతో జరిగిన చర్చల హామీలను అమలుచేయాలి

జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల

విశాలాంధ్ర-పలాస : జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, జీడి పిక్కలను ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిఎంవో అధికారులతో జరిగిన చర్చల హామీలను తక్షణమే అమలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ కోరారు. కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం వద్ద వామపక్ష నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన రాష్ట్ర మత్స్య, పశుసంవర్థక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, సిఎంవో ధనుంజయరెడ్డితో జీడి పంటపై చర్చలు జరగాయని, చర్చల్లో ఇచ్చిన హామీలను నెల రోజులు కావస్తున్నా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటను పంటల జాబితాలో చేర్చి రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పరిశ్రమల యజమాలు ఇన్‌డింట్ మేరకు కొనుగోలు చేసే విధంగా హామీ ఇచ్చారన్నారు. ఉద్యానవన శాఖాధికారులు కమిషనర్లతో కలిసి సోమనాథ్ కమిటీ సిపార్సు మేరకు మద్దతు ధర నిర్ణయించేందుకు హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిఐటీయు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, రైతు సంఘం నాయకులు కొర్ల హేమారావు చౌదరి, కోనేరు గురయ్య, ఎం.జోగారావు, కుత్తుం ఢిల్లీరావు, వంకల అప్పయ్య, డి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో దుప్పలవలస గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : దుప్పలవలస లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల /కళాశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో ప్రతిభ కనబరిచారు విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్ అనంత డైమండ్స్ కేఎల్ యూనివర్సిటీ గుంటూరు ఈనెల రెండవ తేదీన నిర్వహించిన 11వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఈ గురుకులం నుంచి 126 మంది విద్యార్థులకు గీసిన చిత్రాలను పంపించగా 19 మంది విద్యార్థులకు బంగారు పతకాలు 15 మంది విద్యార్థులకు సిల్వర్ పథకాలు సాధించారు అలాగే మిగిలిన విద్యార్థుల మెరిట్ అవార్డు సర్టిఫికెట్లు పొందారు ఈ పాఠశాల డ్రాయింగ్ టీచర్ జి దుర్గారావు కేఎల్ యూనివర్సిటీ నిర్మించిన తాను గీసిన చిత్రాలను ప్రదర్శించి బెస్ట్ ఆర్ట్స్ స్కూల్ అవార్డుకు ఎంపికయ్యారు చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గురుకులం ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు వైస్ ప్రిన్సిపాల్ జి రాంబాబు అభినందించారు.

చిలకలమెట్టలో అభివృద్ధికి శంకుస్థాపన

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం చిలకలమెట్ట గ్రామంలో జాతీయ ఉపాధిహామీ నిధులు, మండల పరిషత్ నిధులు సుమారు నాలుగున్నర లక్షల వ్యయంతో కొత్తగా సిమెంట్ రహదారి నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ పైల దేవదాసురెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రకాష్ చంద్రపండా, జెసిఎస్ కన్వీనర్ కొనపల సురేష్, మాజీ సర్పంచ్ రమేష్ గౌడో, సుర్జిత్ గౌడో తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన : 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులు రెండున్నర లక్షల రూపాయలతో జాడుపూడిలో తాగునీటి పథకానికి ఎంపీపీ దేవదాసురెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ పలికల ద్రాక్షాయని జయరాం, ఎంపీటీసీ జామి జయ, పిలక సోమేశ్వరరావు, కొనపల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి.. గరిష్ట వేతనం పొందండి : డ్వామా పీడీ చిట్టిరాజు

విశాలాంధ్ర-పోలాకి: సమయపాలన పాటించడం ద్వారా కూలీలు గరిష్ట వేతనాన్ని పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జివి చిట్టి రాజు కోరారు. మంగళవారం మండలంలోని చీడి వలస పంచాయితీ పరిధిలో జరుగుతున్న కాలువలో పూడిక తీత పనులను పరిశీలించిన పీడీ వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఒక వరప్రదాయిని వంటదని అభివర్ణించారు. ఇక్కడ కూలీలే యజమానులు, రాజు, మంత్రి అని వారి అబీష్టం మేరకే పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. రోజు రెండు పూటలా కనీసం ఆరు గంటల పాటు పని చేయాలని అన్నారు. గరిష్ట వేతనం పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బందిని అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన 100 రోజుల పనిదినాలను జాబ్ కార్డుదారులు సద్వినియోగం చేసుకొని 100 రోజులపాటు పనులకు రావాలన్నారు. ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంట ఏపిఓ, ఈసీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్‌తో భూ వివాదాలకు తెర

- ఈచట్టంపై అపోహలు, భయాలు వద్దు
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం-2023 వల్ల భూ వివాదాలు, మోసాలను అరికట్టి యాజమాన్య హక్కుపై పూర్తి భరోసా కల్పించే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. 'హక్కులకు హామీ - రైతుకు భరోసా' పేరిట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తో కలసి జిల్లాలోని రైతులు, రెవెన్యూ అధికారులు, అడ్వకేట్లు, పోలీసులకు ఈ చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ చట్టం వల్ల ప్రయోజనాలేంటి? ఎలాంటి మార్పులు వస్తాయి? రెవెన్యూ రికార్డుల్లో నమోదు, భూ వివాదాల పరిష్కారం, కొత్త చట్టంలో సివిల్ కోర్టుల పాత్ర, రికార్డుల నిర్వహణ లాంటి అన్ని అంశాలపై అజేయ కల్లం సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు దేశంలోని 12 రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయని, భూములకు శాశ్వత హక్కు రావాలంటే ఈ చట్టం అమలు జరగాల్సిందేనని చెప్పారు. యజమాని ఎక్కడున్నా భూమికి రక్షణ అవసరమని, మొబైల్ ఫోన్లో భూమి వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఉంటుందని వివరించారు. ఎవరైనా మార్పులు, చేర్పులకు ప్రయత్నిస్తే మనకు సమాచారం కూడా వస్తుందన్నారు. దేశంలోని న్యాయ వ్యవస్థలో 66 శాతం కేసులు సివిల్ తగాదాల వల్లనే ఉంటే, మరో 14 శాతం హత్యలు భూ తగాదాలకు సంబంధించినవే నడుస్తున్నాయని, మిగిలిన దేశాల్లో కేవలం 3 శాతం సివిల్ వివాదాలు మాత్రమే నమోదు అవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వము రీ సర్వేలో భాగంగా 6000 గ్రామాల్లో సర్వేను పూర్తి చేసిందని, ఎయిర్ క్రాఫ్ట్, రోవర్, డ్రోన్లు వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రిఫరెన్స్ చేసి రైతులకు భూ హక్కు పత్రాలను జారీ చేసే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. మొత్తం టైటిల్ రికార్డులు సురక్షితమైన ఆన్లైన్ సిస్టంలో నిల్వ చేయబడి, పాత భూరికార్డులకు స్వస్తి పలికి రైతులకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. వివాదాలుంటే సర్వే, హద్దుల చట్టం కింద సంబంధిత అధికారులను కానీ, సివిల్ కోర్టును కానీ ఆశ్రయించవచ్చని, కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీ, వారసత్వ తగాదాలు ఉంటే సివిల్ కోర్టులు ఎప్పటి లాగానే పరిష్కరిస్తాయని చెప్పారు. ఆస్తి పన్నులు, ఇతర వివాదాలు, కేసులు ఉంటే న్యాయస్థానాలు పరిష్కరిస్తాయనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. రికార్డుల వివరాలపై అభ్యంతరాలుంటే చట్టంలో పేర్కొన్న కాల వ్యవధిలో అప్పీలు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 6000 గ్రామాల్లో సర్వే జరగ్గా కేవలం 2శాతం వివాదాలు మాత్రమే వ్యక్తమయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వే లాండ్ రికార్డ్స్ అడిషనల్ కమిషనర్ అర్.గోవిందరావు మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం సదస్సుకు వచ్చిన వారు అడిగిన పలు సందేహాలను అజేయ కల్లం నివృత్తి చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్‌డిఓ సి హెచ్.రంగయ్య, ఎడి సర్వేయర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కెరీర్‌ని మార్చుకోవాలి : బీఆర్‌ఏయూలో టెక్ ఫెస్ట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విద్యార్థి దశ నుంచి కెరీర్‌ని మలుచుకునేలా అడుగులు వేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.ఆర్ రజిని అన్నారు. వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వైబ్రేట్ విస్తా టూకే టు ఫోర్ పేరిట రెండు రోజులు పాటు నిర్వహించనున్న వైజ్ఞానిక సాంకేతిక ప్రతిభ ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం బాధ్యత నిరంతర శ్రమ అవగాహన కలిగి ఉండాలన్నారు విభిన్న ఆలోచనలు ఆశావాహ దృక్పథంతో వివిధ అంశాల పట్ల సానుకూలంగా ఉండాలన్నారు విద్యార్థులు విజ్ఞానవంతులై వర్సిటీ పేరును ఇనుమడింప చేయాలన్నారు ప్రత్యేక అతిథిగా హాజరైన వల్సస్ సీఈవో బీఆర్ఏయు పాలకమండల సభ్యుడు డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని వీటిని సద్వినియోగ పరుచుకునేలా విద్యార్థులు తరఫున పొందాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 30 లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని విద్యావంతులైన వారిలో ప్రతి పది మందిలో 8 మంది ఇదే బాధపడుతున్నారన్నారు. దీని నివారణకు యువత దోహదపడాలన్నారు ఈ ప్రాంత రైతులు పండించే ఆహార ఉత్పత్తులకు వాణిజ్య పంటలకు డిజిటల్ మార్కెటింగ్ కు విద్యార్థులు ప్రయత్నించాలన్నారు కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులను ఆకలింపు చేసుకుంటే మంచి వ్యాపార పారిశ్రామిక వేత్తలు కాగలరన్నారు నూతన ఆవిష్కరణలకు యువత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజశేఖర్ రావు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ సిడిసిన్ ప్రొఫెసర్ పి సుజాత తదితరులు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతికపరమైన అంశాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు చేసిన డప్పు వాయిద్యాలు, జానపద నృత్యాలు అలరించాయి.

గౌతు శిరీష వ్యాఖ్యలపై జర్నలిస్టుల నిరసన

విశాలాంధ్ర-పలాస: తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గం ఇన్‌చార్జీ గౌతు శిరీష మండలం నీలావతి గ్రామంలో టీడీపీ, జనసేన సమన్వయంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పలాస కాశీబుగ్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులకు శిరీష బహిరంగ క్షమాపణ చెప్పాలని, మీడియా స్వేచ్ఛపై భౌతికదాడులు నశించాలని, జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతీసే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా కార్యదర్శి డి.మహారణ మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన ఆర్టికల్ 19(1)ఆ కింద ప్రసాదించిన భావప్రకటన వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే విధంగా శిరీష మాట్లాడడం సరికాదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుని మనవరాలు చెప్పుకుంటున్న శిరీష జర్నలిస్టులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పత్రికల్లో వచ్చిన వార్తలు ఇబ్బందికరంగా ఉంటే చట్టపరంగా వెళ్లాలి తప్పా భౌతికదాడులకు పాల్పడేవిధంగా మాట్లాడడం సరికాదని, వ్యక్తులకు కించపరిస్తే ఆ వ్యక్తులు వెనుక ఉన్న కుటుంబాలు కూడా ఉంటాయని, ఒక మహిళా నేతగా గుర్తించాలని కోరారు. వారం రోజుల్లో జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే జర్నలిస్టుల ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు చాపర వేణుగోపాల్, వంకల మాధవరావులు మాట్లాడుతూ మీడియా బాహు ప్రకటన స్వేచ్ఛని హరించే విధంగా రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్రంలో వ్యవహరిస్తున్నారని, అది సరైనది కాదన్నారు. పాలకులైనా, ప్రతిపక్షాల నేతలైన రాజ్యాంగం మీడియాకు కల్పించిన స్వేచ్ఛ

స్వాతంత్రాలను కాపాడాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులకు భంగం వాటిల్లితే ప్రజాసంఘాల వామపక్ష పార్టీలు జర్నలిస్టులకు అండగా నిలబడి పోరాడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా అధ్యక్షులు చిక్కోలు జగదీష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు సి.హెచ్.నేతాజీ, సీనియర్ జర్నలిస్టులు అంది రామక్రిష్ణ, కింజరాపు కృష్ణ, ఎన్.నారాయణ, కొంచాడ రవి, వంకల రాజారావు, తిరుమల, ఎస్.రవి, కుందు కృష్ణ, చంద్రరావు, రమేష్, జగన్, శ్రీనివాస్, నాని, సంతోష్‌లతో పాటు సీఐటియు నాయకులు గణపతి, కార్మిక సంఘం నాయకులు దుశ్యంత్, దున్న శ్రీను, మద్దిల రామారావులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయనిర్ధారణలో వీడియోగ్రఫీ ప్రధాన పాత్ర : సీపీఓ లక్ష్మీప్రసన్న

విశాలాంధ్ర-శ్రీకాకుళం : మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో వీడియో సర్వెలెన్స్ టీమ్‌ల కొరకు వీడియోగ్రాఫర్‌లకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమం డిసిఓ బాలాజీ నాయక్ అధ్యక్షతన జరిగింది. శిక్షణా కార్యక్రమంలో సిపిఓ లక్ష్మి ప్రసన్న, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఓ వెంకటరామన్‌లు మాట్లాడుతూ ఎన్నికల వ్యయనిర్ధారణలో వీడియోగ్రఫీ పాత్ర కీలకమని అన్నారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. వీడియో గ్రాఫర్‌లు ఎన్నికలకు జరిగిన వ్యయానికి సందర్భాలను సంగటనలను చిత్రీకరణ చేయాలని తెలియజేశారు. పోస్టర్లు, వాహనాలు, కట్ అవుట్‌లు, బ్యానర్లు, ఫర్నిచర్ తదితర అంశాలను వీడియోగ్రఫీలో చిత్రీకరించాలని తెలియజేశారు. వీడియో కవరేజ్ ప్రారంభించే ముందు ఏవిధమైన కార్యక్రమము, తేదీ, స్థలం, ఏపార్టీకి సంబంధించినది కార్యక్రమం నిర్వహిస్తున్న అభ్యర్థి తదితర అంశాలను వాయిస్ మోడ్ ద్వారా రికార్డు చేయాలని తెలియజేశారు. అనంతరం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ వీడియో గ్రఫీ నిర్వహణలో పలు సాంకేతిక వివరాలు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లాలో వీడియో గ్రాఫర్ పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించే అభివృద్ధి సర్కార్‌కే సాధ్యం : స్పీకర్

విశాలాంధ్ర-పొందూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఋణం తీర్చుకోడానికి ఏప్రభుత్వం అందివ్వలేని మౌలిక వసతులు కల్పనలో తెలుగు జాతి గర్వించే అభివృద్ధి సర్కార్కే సాధ్యమని శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మంగళవారం పొందూరు మండలం గోరింట గ్రామంలో సుమారు 40 లక్షల నిధులతో గ్రామ సచివాలయాలు సుమారు 41 లక్షల నిధులతో తాడివలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి పైడి జోగిపేట గ్రామానికి కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డును స్పీకర్ ప్రారంభించారు. అదేవిధంగా సుమారు 10 లక్షల నిధులతో గోకర్ణ పల్లి గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో అభివృద్ధి సంక్షేమ విషయంలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింద న్నారు. సీఎం జగన్ అత్యుత్తమ నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. వృద్ధులకు పింఛన్లు, పేదలకు రేషన్ మొదలుకుని అన్ని సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఏకైక సీఎం జగన్ అని పునరుద్ఘాటించారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా అవినీతి రహిత పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవు తున్నాయని చెప్పారు. యువతకు ఉపాధి కల్పన, రైతు భరోసా, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, జగనన్న విద్యా దీవెన, విద్యాకానుక, అమ్మఒడి, మత్స్యకార భరోసా, కాపు నేస్తం, అగ్రకులాల్లోని పేదలకు ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమాన్ని అందించటమే సీఎం ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నారన్నారు. ప్రజల్లో తన స్థానాన్ని మరింత పదిల పరుచుకొని ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఎంతో నిబ్బరంగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలు అమలుపరుస్తూ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు తమ్మినేని కృష్ణకుమారి, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి కూన రమణమ్మ, స్థానిక నాయకులు మండల సచివాలయాల కోఆర్డినేటర్ బాడాన కృష్ణ, కూన గోపాలం, తమ్మినేని ప్రతాప్, స్థానిక సర్పంచ్ చింతాడ మాధురి, చింతాడ ప్రసాద్, తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పతనానికి చివర మెట్టు నోటి దురుసు!

- సర్దార్ మనవరాలి స్థాయి ఇది కాదు
- జర్నలిస్టు సంఘాల ఆవేదన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం రాజకీయ చరిత్రలో సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబానికి ఒక ప్రాధాన్యత, ప్రత్యేకత ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడుగా సర్దార్ లచ్చన్న చుపరిచితులు. అదే సమయంలో పత్రికారంగ ప్రాధాన్యత తెలిసినవారు. 'బహుజన' అనే పత్రికను స్థాపించి, కాన్షీరాంకు ముందే బహుజన వాదానికి ఆద్యుడైనవారు. ఆయన తరువాత మీడియాని బ్లాక్ మెయిల్ చేయడం, యాజమాన్యాలను మేనేజ్ చేసి విలేకరులను తప్పించడం శిరీష తండ్రి శివాజీకి వెన్నతో పెట్టిన విద్య. పలాస నియోజకవర్గం నుంచి శివాజీ పోటీ చేసిన తరువాత ఆయన రాజకీయ వారసురాలిగా శిరీష రంగంలోకి వచ్చింది. పేరుకే శిరీష! చక్రమంతా భర్త వెంకన్నచౌదరి చేతుల్లోనే! భూకబ్జాల చరిత్ర పాపాన్ని ఆయన మూట కట్టుకున్నాడని కొంతమంది ఆరోపణ. ఈ ఆరోపణల నేపథ్యంలోనే తొలిసారిగా రాజకీయ జీవన ప్రవేశం చేసిన ఆమె ఓడిపోయారు. పరాజయం, రాజకీయ పరాభవం తరువాత కూడా ఆమె గుణపాఠం నేర్చుకోలేదు. తమ తప్పులుని సరిదిద్దుకోలేదు. అహంకార ప్రవర్తన వల్ల ఎవరికి అధికారం రాదు. ప్రజాస్వామిక విలువలను గుర్తించాలి. ప్రజల మనోభావాలను గౌరవించాలి. మీడియా కళ్ళు చెవులుగా సమాజంలో వ్యవహరిస్తోంది. ఒక్క రాజకీయ ప్రతినిధుల వ్యవస్థ మాత్రమే నిజాయితీగా ఉంది అని అనుకోవడం ఓ అహంకార భావన. ఆత్మవిమర్శ చేసుకుంటే ఎన్ని తప్పులు చేసామో అంతరాత్మకు తెలుసు. మీడియా కూడా దేనికి అతీతమైనది కాదు. మీడియా ప్రతినిధులకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది. ప్రెస్ మీట్లు.. టీ బిస్కెట్లు.. ఇలా రాజకీయాలు నడుపుతాం అనుకుంటే ఓ భ్రమ. మీడియా ప్రతినిధుల వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడడం రాజకీయ రంగంలో ఉన్నవారికి తగదు. ఎవరి ప్రైవేట్ బతుక వారి సొంతం.. పబ్లిక్‌లోకి వస్తే ఏమైనా అంటాం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన శిరీష ఈ వాస్తవాలను తెలుసుకోవాలి. నోరు జారితే ఎవరు వెనక్కి తీసుకోలేరు. పలాస జర్నలిస్టులు మీద ఆమె చేసిన ఆరోపణలు చాలా నీచమైనవి. ఒక ఆడపిల్ల మాట్లాడవలసిన మాటలు కావని పలాస- కాశీబుగ్గ వీర గున్నమ్మ ప్రెస్ క్లబ్ ఆవేదన వ్యక్తం చేసింది. శ్రీకాకుళములో గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కూడా మనస్థాపం చెందింది. ఆమె బేషరతుగా క్షమాపణ చెబితే, సర్దార్ గౌతు కుటుంబం ప్రతిష్ట నిలబడిన వారవుతారని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వర రావు, కూన పాపారావు, చిన్న, మధ్య తరహా వార్తాపత్రికల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం వి మల్లేశ్వరరావు, జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు చింతాడ అప్పలనాయుడు, డి.మహారాణా, చిన్న మధ్య తరహా వార్తాపత్రికల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్ నవ చైతన్య, చౌదరి సత్యనారాయణలు విమర్శించారు.

సంక్షేమం, సామాజిక ప్రగతి దిశగా ఏపీ

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం

విశాలాంధ్ర-ఎచ్చర్ల : విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహదారు అజయ్ కల్లాం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వలు సంక్షేమ పథకాలు వలన సామాజికాభివృద్ధికి ఊతమిచ్చాయన్నారు. ఇండియన్ ఇంటలెక్చ్యుల్ ఫోరమ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో సుపరిపాలనా దిశగా ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో సామాజిక, ఆర్థిక స్వావలంభన వచ్చినపుడే నిజమైన ప్రగతికు నిదర్శనమన్నారు. ఆ దిశగా అడుగులు వేయడంలో భాగంగానే ప్రభుత్వ వైద్యకళాశాలలు ఏర్పాటు, యువతకు ఉపాధి అందించే పారిశ్రామిక ఒప్పందాలు, రైతులకు ఉపయోగపడే చట్టాలు వంటి సాహసోపేత విధానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందని అజయ కల్లాం తెలిపారు. డా.బిఆర్ఏయూ కులపతి ఆచార్య కె.ఆర్. రజిని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. శాంతమూర్తి, వర్సిటీ రిజిస్టర్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రొఫెసర్ వి.వెంకట్రావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ఈసందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు అజయ్ కల్లాం సమాధానమిచ్చారు.

చౌకబారు మంత్రికి చివాట్లు సరైనవే...

ఆశ్రమం అధ్యక్షులు విశ్వనాథం

విశాలాంధ్ర-పోలాకి : ఇటీవల సమాజంపై కీడు చేసే వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయ నిధికి ప్రముఖ న్యాయస్థానం సుప్రీంకోర్టు చివాట్లు పెట్టడం సరైనని చర్యేనని శ్రీ రామయోగి ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం అన్నారు.మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.సనాతన ధర్మమును చికెన్ గున్యా డెంగ్యూ కంటే ప్రమాదకరమని వ్యాఖ్యలు చేయడం పట్ల న్యాయ స్థానం ఘాటుగా స్పందించునట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ఉన్నతమైన పదవులు అలంకరించి సమాజంకు కీడు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరైన చర్య కాదని న్యాయస్థానం హెచ్చరించడం శుభ పరిణామం అని అన్నారు. ఇటువంటి చౌకబారు ప్రకటనలతో చులకన అవడం తప్ప రాజ్యాంగపరమైన పదవులకు మచ్చ తెచ్చే మంత్రులపై సరైన చర్యలు గైకొని శిక్షించవలసిందిగా కోరారు.

రామస్వామికి ఉత్తమ లైన్‌మెన్ అవార్డు ప్రధానం

విశాలాంధ్ర-ఆముదాలవలస : మండలంలోని రూరల్ సెక్షన్ పరిధి అక్కులపేట పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ మీసాల రామస్వామికి ఉత్తమ లైన్‌మెన్ అవార్డు దక్కింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నేతృత్వంలో టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన లైన్‌మెన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఈ అవార్డు అందుకున్నారు. విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంలో ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్‌కు ఈ అవార్డు దేశవ్యాప్తంగా ప్రధానం చేయ దంతో జిల్లా నుంచి మండలానికి చెందిన రామస్వామి కి దక్కడంతో పలువురు నుంచి ప్రశంసలు అందుకున్నారు. విధినిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ నిరంతరం వినియోగదారులకు సేవలు అందించాలన్న లక్ష్యంతో పనిచేసినందుకు అవార్డు దక్కింది. విద్యుత్ పునరుద్ధరణ కోసం చేస్తున్న సేవల ను గుర్తించి ఈ అవార్డ్ అందజేయడం జరి గింది. రామస్వామికి ఉత్తమ లైన్ మెన్ అవార్డు రావడంపై ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణ మూర్తి, ఈఈ బయ్యనాయుడు, డిఈ భాస్కరరావు, రూరల్ ఏఈ బి రవికుమార్, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు విద్యుత్ ఉద్యోగ సిబ్బంది అభినందించిన వారిలో ఉన్నారు.

దూర డిగ్రీ విద్యకు ఈనెల 15 వరకు గడువు పెంపు

విశాలాంధ్ర-హిరమండలం: మండలంలోని శ్రీరామేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా పట్టాకు ఈనెల 15వ తేది వరకు గడువు పెంచినట్లు శ్రీ రామేశ్వరి డిగ్రీ కళాశాల కరస్పాండెట్ రెడ్డి గోపాల్‌రావు మంగళవారం తెలిపారు,, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం హిరమండలంలోని రామేశ్వరి డిగ్రీ కళాశాలకు మంజూరు అయి దాదాపు 3 సంవత్సరాలు అయ్యింది. దూరవిద్య డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్స్ జరిగాయని, ఆసక్తి అభ్యర్థులు నుంచి 100 రూపాయలు అపరాధరుసుముతో అడ్మిషన్స్ జరుగుతున్నాయని విద్యార్థులు ఈఅవకాశంను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. 2024 మార్చి నెల 15వ తేది ఆఖరి తేది అని త్వరపడాలని కోరారు. బిఏ, బి.కామ్, ఎంఏ, ఎంకామ్, బిసిఐఎస్సి, ఎంసిఐఎస్సి తదితర డిగ్రీ కోర్సులు కలవని డిగ్రీ కోర్స్‌లో చేరేవారు శ్రీ రామేశ్వరి డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు చేసుకో వాలని కోరారు. పూర్తి వివరాలకు 9441178791, 9010131698లకు మరిన్ని వివరాలకు సంప్రదించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా ఫేర్వెల్ కార్యక్రమం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగరంగ వైభవంగా ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు. స్తానిక ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బరాటం కామరాజు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు, పాఠశాలలో ఉన్న ఇతర తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రతీ సంవత్సరం జరిపిన విధంగానే, ఈ ఏడాది పరీక్షలు నిర్వహించేముందు. ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు బరాటం కామరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ఆహ్లాదం కలిగించే వినోద కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు చిన్నవాడు, అర్జునుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ఫ్లెక్సీలు చించివేత దుర్మార్గమైన చర్య

పేడాడ రామ్మోహన్‌రావు

విశాలాంధ్ర-బూర్జ : ఆముదాలవలస నియోజకవర్గంలోని బూర్జలోని సంకురాడ పద్ద ప్రధాన రహదారిపై స్థానిక జనసేన నాయకులు ఏర్పాటుచేసిన జనసేన ఫ్లెక్సీలను సోమవారం రాత్రి వైసీపీ దుండగులు చించివేశారని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సైకో ముఖ్యమంత్రి పాలనలో వారి కార్యకర్తలు కూడా సైకోలుగా మారుతూ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలపై వైసీపీ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. నియోజకవర్గ ప్రజలందరూ వైసిపి అరాచకాలను గమనిస్తున్నారని రానున్న రోజుల్లో వైసీపీని ఓడించేందుకు సిద్ధమయ్యారని అన్నారు.

మహిళా శక్తి గొప్పది

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : సృష్టిలో మహిళ పాత్ర కీలకమైందని భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుద్దాల నిర్మల అన్నారు. నారీ శక్తి వదన్ కార్యాక్రమాన్ని పార్టీ క్యేడర్‌తో కలిసి చేపట్టారు. మంగళవారం పట్టణంలో కాదాలక్ష్మికాంతం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించి మహిళ సంరక్షణ నినాదలు చేసారు.

అనంతరం బొడ్డఖాళి గ్రామంలో మహిళలతో కలిసి గ్రామంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మహిళలను గౌరవ ప్రదంగా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందని, ఆ గౌరవాన్ని నిలుపుకోవడం కూడా ముఖ్యమని, వివిధ సందర్భాల్లో మహిళల త్యాగాలు అమూల్యమైనవని అన్నారు. అనంతరం బొడ్డఖాళి గ్రామంలో మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆశి సత్యం, బోర తులసిరావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన శ్రీముఖలింగంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-జలుమూరు: మండలం శ్రీముఖలింగంలో ఈనెల 8నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి వేడుకలలో భాగంగా గ్రామాన్ని పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జమున తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రధాన రహదారిలో జెసిబి తో పనులను ప్రారంభించామని వివరించారు. అంతేకాకుండా మురుగు కాల్వలను కూడా క్లీన్ చేయిస్తామన్నారు.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకే సైన్స్ ప్రాజెక్టు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు సైన్సు ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని మదర్‌థెరిస్సా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగాభవానీ అన్నారు. మంగళవారం పలాస మదర్ థెరిస్సా పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్సు ప్రాజెక్టు విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షల్లో విరివిగా పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. చిన్న వయస్సు నుంచే ప్రాజెక్టులు తయారీ చేయడం వాటిని వివరించడంపై దృష్టిసారించాలన్నారు. భవిష్యత్‌లో ఇప్పుడు చేసిన ప్రాజెక్టులు, ప్రతిభలు ఉన్నత చదువులకు ఉపయోగ పడుతుంటాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం : ఏపీఎం రమణమ్మ

విశాలాంధ్ర-సోంపేట : ప్రజల ఆరోగ్యానికి అటు నేల ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేసే ప్రకృతి వ్యవసాయం విస్తరించేందుకు ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని సోంపేట వెలుగు ఏపీఎం జి.రమణమ్మ పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి దీనిపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేసేందుకు రాష్ట్రస్థాయిలో ఆర్‌వైఎస్ఎస్, శ్రీనిధి సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తూ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు ఇచ్చాపురం, కవిటి, సోంపేట మండలాల్లో దీనిప్రాధాన్యత పెంచేందుకు తీర్మానాలు చేశారు. ప్రాజెక్టు మేనేజర్ రేవతి, శోభన్‌బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలుపై యూటీఎఫ్ వినతి

విశాలాంధ్ర-కొత్తూరు : ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్, జీపీఎస్ వద్దు, ఓపిఎస్ విధానాన్ని అమలుచేయాలంటూ యూ.టీ.ఎఫ్ ఉద్యోగుల సంఘం కొత్తూరుశాఖ తమ ఆందోళనలో భాగంగా మంగళవారం కొత్తూరు మండల పరిషత్ వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని విన్నవించాలని కొత్తూరు యు.టీ.ఎఫ్ అధ్యక్షులు శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి విజయకుమార్ సీనియర్ నాయకులు దండు ప్రకాషరావు, సంఘ సభ్యులు నాగయ్య, క్రాంతికుమార్, భద్రయ్య తదితరులు కోరారు.

ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్న డిఐజి

విశాలాంధ్ర-జలుమూరు: మండలం శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వరుని ఆలయ చరిత్రను స్థానిక అర్చకులను, డిఐజి విశాల్ గున్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విశిష్టత ఉన్నందువల్లే భక్తులు స్వామి దర్శనానికి తరలిరావడం కనిపి స్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆయన మంగళవారం దర్శించుకున్నారు. వేదమంత్రాలతో స్థానిక అర్చకులు పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక పాల్గొన్నారు.

భారత ప్రజాస్వామ్యం భేష్ : సబ్ కలెక్టర్ నూరుల్ క్వమెర్

విశాలాంధ్ర-టెక్కలి : ప్రజాస్వామ్యం అమలవుతున్న ప్రపంచదేశాల్లోని అనేక దేశాల కంటే భారత్లో అమలవుతున్న ప్రజాస్వామ్యం భేషుగ్గా ఉందని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ క్వమెర్ చెప్పారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ మరియు నెహ్రూ యువకేంద్రం, ఐతమ్ ఎన్ఎస్ఎస్ యూనిట్లు మంగళవారం టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే జిల్లాస్థాయి మాక్ యూత్ పార్లమెంట్ సమావేశ ప్రారంభోత్స వంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో సాతంత్ర్యం వచ్చిన ఎన్నోఏళ్ళకు గాని మహిళలకు ఓటుహక్కు కల్పిం చలేదని మన దేశంలో అక్షరాస్యతా శాతం అత్యంత అల్పంగా ఉన్నా స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మహిళలకు ఓటు హక్కు కల్పించారన్నారు. మన పూర్వీకులు, రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్య పోరాట యోదులు ముందు చూపుతో ప్రజలందరికీ సమాన హక్కులు అందేలా పాటుపడ్డారన్నారు. రాజుల కాలంలోరక్షణకే అధిక ప్రాధాన్యతనిచ్చేవారని నేడు 80శాతానికి పైగా పెట్టుబడులు జాతి అభివృద్ధికి, మౌళిక వసతుల అభివృద్ధి కి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయన్నారు. నేడు మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు విద్య, వైద్యం, సాంకేతికత, నెట్వర్కింగ్ వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నేరస్తులు రాజకీయాల్లోకి రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రజలందరిపైనా ఉందని, ప్రతీ ఒక్కరూ ఆలోచించి విధిగా ఓటు వేయాలన్నా డు. ఏదైనా సాధించాలన్న దృఢ సంకల్పం ఉంటే తప్పక విజయాలు సాధించవచ్చని సబ్కలెక్టర్ చెప్పారు. నెహ్రూయువ కేంద్రం జిల్లా అధికారి వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, మాట్లాడే నైపుణ్యత వంటి అంశాల్లో యువత శ్రద్ధచూపాలన్నారు. యువతను చైతన్య పరుచుటకు అనేక ప్రోగ్రామ్స్ ను చేపడుతున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఈ మాక్ పార్లమెంట్ తరహా సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెట్ సిఈఓ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు నెహ్రూయువకేంద్రం గణాంకాధికారి శ్రీనివాసరావు, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, నెహ్రూ యువకేంద్రం సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్ అట్టాడ రాజేష్, డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎన్.ఎస్.ఎస్.పి. డాక్టర్ బి.బలరాంలు అనేక అంశాలపై మాట్లాడుతూ యువతకు చైతన్యపరిచారు. అనంతరం బిటెక్, ఎంబిఏ విద్యార్థులతో మాక్ పార్లమెంట్ను నిర్వహించగా విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. పలు అంశాలను మాక్ పార్లమెంట్ లో చర్చించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు.

ఆర్అండ్ బి అధికారుల తీరుపై స్పీకర్ ఆగ్రహం

రహదారి ప్రారంభోత్సవాన్ని నిరాకరిస్తూ వెళ్లిపోయిన స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-పొందూరు : స్థానిక ప్రజాప్రతినిదులకు, నాయకులకు సమాచారం ఇవ్వకుండా రహదారి ప్రారంభోత్సవానికి ఆర్అండ్బి అధికారులు ఏర్పాట్లు చేయడంపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండలంలోని రాపాక పంచాయతీ వావిలపల్లిపేట కూడలి నుండి వి.ఆర్. గూడెం, వయా ధర్మపురం మీదుగా తోలాపి వరకూ నూతనంగా నిర్మించిన రహదారిని స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులు మీదుగా ప్రారంబోత్సవానికి మంగళవారం అర్అండ్బి అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.6.15కోట్లుతో సుమారు 8కిలోమీటర్లు పొడవు నిర్మాణం జరిపిన రహదారిని ప్రారంభించేందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం వచ్చారు. కాని అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కనిపించకపోవడంతో ఆర్అండ్ బి జేఈ ఆంజనేయనాయక్, గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి మీదుగా ప్రారంబోత్సవానికి మంగళవారం అర్అండ్బి అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.6.15కోట్లుతో సుమారు 8కిలోమీటర్లు పొడవు నిర్మాణం జరిపిన రహదారిని ప్రారంభించేందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం వచ్చారు. కాని అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కనిపించకపోవడంతో ఆర్అండ్ బి జేఈ ఆంజనేయనాయక్, గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి ప్రారంభోత్సవం జరిపేటప్పుడు స్థానికంగా ఉన్న వైస్ ఎంపీపీ, సర్పంచ్లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలి కదా, ఎందుకు చెప్పలేదంటూ ప్రశ్నించారు. ఇలాగేనా రహదారుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసేది అని, రహదారి ప్రారంభానికి నిరాకరిస్తూ వెనక్కి వెళ్లిపోయారు. దీంతో అక్కడ ఉన్న పలువురు వైసిపి నాయకులు ఆర్అండ్బి అధికారుల తీరును వ్యతిరేకించారు. ఈయన వెంట వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు కొంచాడరమణమూర్తి, వైసిపి నాయకులు గుడ్ల మోహనరావు, పకీరు, కోట నాగరాజు, వందాన సూరపనాయుడు, గోవిందరావు, తదితరులు ఉన్నారు.

అమృత్ భారత్ స్కీంతో అభివృద్ధి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక రైలు నిలయం అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రైల్వే స్టేషన్ మేనేజర్ హెచ్.కె. సాహు అన్నారు. ఇటీవల విశాఖపట్టణం-పలాస పాసింజర్‌ను బెర్హంపురం వరకూ పొడిగిస్తూ ఇచ్ఛాపురంలో హాల్ట్ కల్పించిన నేపధ్యంలో స్థానిక జె.సి.ఐ రైల్వే సిబ్బంది సహకారాన్ని గుర్తించి మంగళవారం ఘనంగా సత్కరించింది. జె.సి.ఐ అధ్యక్షులు టి. షణ్ముఖ్ ఆధ్వర్యంలో స్టేషన్ మేనేజర్‌తో పాటు బుకింగ్, రిజర్వేషన్ సూపరింటెండెంట్లు ఏ. రమణ, డి.ఎస్.మూర్తిలను దుశ్శాలువలతో సత్కరించారు. విశాఖపట్టణం పాసింజర్ నిలుపుదలతో పరిసర ప్రాంత వాసులకు మేలు జరుగుతుందని షణ్ముఖ్ అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ మాట్లాడుతు స్థానిక రైలు నిలయం ఆదాయంలో కూడా వృద్ధి చెందుతూనే ఉందని, అమృత్ భారత్ పధకంలో నామినేట్ కావడం శుభపరిణామం అని, తద్వారా స్టేషన్ దశ మారుతుందని అన్నారు. రైల్వే ప్రయాణీకుల కోసం ప్రధమ చికిత్స పెట్టెను ఏర్పాటు చేసిన జె.సి.ఐ బృంధాన్ని రైల్వే సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో జె.సి.ఐ ప్రతినిధులు గోరు డిల్లేసు, స్వరూప్‌కుమార్, నవీన్ కుమార్, పవన్, గౌరీ శంకర్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే... మళ్ళీ జగన్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే రాష్ట్రంలో వై.సి.పి అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని జెడ్పీ ఛెయిర్‌పర్సన్ నియోజకవర్గ వై.సి.పి సమన్వయకర్త పిరియ విజయ అన్నారు. ఆమె మంగళవారం మండలంలో మండపల్లి, బాలక్రిష్ణాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఎమ్పీపి బోర పుష్ప, జెడ్పీటీసి ఉప్పాడ నారాయణమ్మలతో కలిసి పాల్గొన్నారు. మండపల్లి పంచాయతీ పరిధిలో రూ॥8లక్షల జిల్లా పరిషత్ నిధులతో డ్రైనేజీ నిర్మాణ

పనులకు శంకుస్థాపన చేసారు. బుడ్డేపు పేట గ్రామంలో రూ॥ 5లక్షలతో నిర్మించిన హరిజన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మండపల్లి సర్పంచ్ పిట్ట శేషమ్మ ఆధ్వర్యంలో అక్కడి మహిళలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పిరియా విజయ పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీకి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, లబ్దిదారులు పొందిన పధకాల లబ్దిని మహిళలకు వివరించారు. ఈ పధకాలను కొనసాగించుకోవడానికి వచ్చే ఎన్నికల్లో వైసిపికి తోడుగా నిలిచి మరోసారి వై.ఎస్.జగన్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పిట్ట మామయ్య, కారంగి మోహన్ రావు, సల్ల దేవరాజ్, దక్కత నూకయ్య, ఉప్పడ రాజు, బుడ్డ కళ్యాణ్, టౌన్ జే.సి.ఎస్ అధ్యక్షులు సాలిన డిల్లిరావు, మోహన్ దాస్, పార్టీ క్యేడర్ పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

విశాలాంధ్ర-జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగేశ్వరుని మహాశివరాత్రి ఉత్సవాలకు దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు పలువురు ప్రముఖులకు ఆహ్వానం పలికారు. ఆలయ ధర్మకర్త కల్యాణి గజపతి నారాయణ మహాదేవ్ వర్మ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఆర్డీవో రంగయ్య, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ కు ఆహ్వాన పత్రికలు అందించారు. ఈవో పి.ప్రభాకరరావు ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ నర్తు



విశాలాంధ్ర-కవిటి : విశాఖపట్నంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ఎంఎల్‌సి నర్తు రామారావు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పలు సమస్యలపై వివరించారు. కవిటి మండలంలో మంగళవారం సంత నుండి జగతి వరకు రోడ్ నిర్మాణం అలాగే కంచిలి మండలం ఆదివారం సంత నుండి కవిటి రోడ్ వరకు రోడ్ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వెనకబడిన యాదవ కులంను బిసిడి నుండి బిసిబి జాబితాలో చేర్చాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన వారికి వృధాప్య ఫించన్ మంజూరు చేయాలని కోరారు.

మేజర్ పంచాయతీ కన్నా... మైనర్ పంచాయతే మీన్నా

విశాలాంధ్ర-పొందూరు : పేరు పెద్ద ఊరు దిబ్బా అన్న రీతిలో మారింది. పొందూరు పంచాయతీ, సంక్రాంతికి నెలరోజులు ముందు బత్తులవీధి లో వాడుకలో ఉన్న కాలువాను బాగుచేయండి మహాప్రభో అని ప్రాంత ప్రజలు మొరపెట్టుకొంటే, మురుగునీరు పోకుండా కాలువలో క్రాసర్ బుగ్గి పోసి మురికి గుంతగామార్చారు. వీటి కారణంగా ప్రజలు అనేక అవస్థలుపడి మంగళవారం కాలువ పూడిక తీతలు నిర్వహించారు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్యంవీడి కాలువ నిర్మాణం చేపట్టాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-జలుమూరు: శివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎస్పీ రాధిక ఆదేశించారు.

ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఉచిత, ప్రత్యేక దర్శనం కోసం వేరువేరు క్యూ లైన్లు, ఎండ తగలకుండా సామాన్లు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. చివరి రోజు స్వామివారి చక్రతీర్థం స్నానాలకు అదనపు బలగాలు తెప్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.